# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# కేంద్ర కమిటీ

**పత్రికా విజ్ఞప్తి**

**10 సెప్టెంబర్, 2022**

## సెప్టెంబర్ 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు

## పార్టీ 18వ వార్షికోత్సవం జరపండి!

పార్టీ 18వ వార్షికోత్సవాన్ని దేశవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో విప్లవోత్సాహంతో, దృఢ సంకల్పంతో జరపవలసిందిగా భారత కమ్యూనిస్టు పార్టీ (కేంద్ర కమిటీ) యావత్తు పార్టీ, పీఎల్ జీఏ, విప్లవ ప్రజా కమిటీ శ్రేణులకు, విప్లవ ప్రజానీకానికీ పిలుపునిస్తున్నది. దేశం నలుమూలలా ప్రజా పునాదిని పెంపొందించి, పార్టీని బలోపేతం చేసి, భారతదేశంలో ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేయవలసిందిగాను, వ్యూహాత్మక 'సమాధాన్'-ప్రహార్ దాడిని ఓడించవలసిందిగానూ పిలుపునిస్తున్నది.

పార్టీ 18వ వార్షికోత్సవం సందర్భంగా, మా పార్టీ వ్యవస్థాపక నాయకులయిన కామ్రేడ్ చారు మజుందార్, కామ్రేడ్ కన్హయ్ ఛటర్జీలతో సహా ప్రజల విముక్తి కోసం తమ ప్రాణాలు అర్పించిన అమరులందరికీ కేంద్ర కమిటీ వినమ్రంగా విప్లవ జోహార్లు తెలియజేస్తున్నది. పెరూ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు కామ్రేడ్ గొంజాలో, ఫిలిప్పీన్స్ లో ఎన్ పీఏ అధికార ప్రతినిధి కామ్రేడ్ కా ఓరిస్, గెలీషియా మావోయిస్టు కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపక నాయకుడు కామ్రేడ్ మార్టిన్ నాయా వంటి అనేక మంది నాయకత్వ కామ్రేడ్స్ అమరత్వం అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి తీవ్రమైన నష్టం.

గాయపడ్డ పీఎల్ జీఏ యోధులకు కేంద్ర కమిటీ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారు త్వరగా కోలుకుని తిరిగి ప్రజాయుద్ధ రంగంలోకి దుకుతారని బలంగా ఆశిస్తున్నది. జైలులో విప్లవ పతాకను ఎత్తి పడుతున్న మా పార్టీ సీనియర్ నాయకుడు, పొలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ కిషన్ దా, కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్స్ షీలా దీదీ, కంచన్ దాదా, కృష్ణమూర్తి, విజయ్ కుమార్ ఆర్యాలతో సహా యావత్తు రాజకీయ ఖైదీలకు విప్లవాభినందనలు తెలియజేస్తున్నది.

గడచిన సంవత్సర కాలంలో పార్టీ, పీఎల్ జీఏ, వ్యూహాత్మక, ఎత్తుగడల ఐక్య సంఘటనా రంగాలలో, తీవ్ర శత్రు నిర్బంధం మధ్య గత ఏడాది 17వ వార్షికోత్సవం సందర్భంగా పార్టీ రూపొందించిన కర్తవ్యాలను నెరవేర్చేందుకు కృషి జరిగింది. ఈ కృషిలో ముఖ్యాంశాలు.

సైద్ధాంతికంగా బలోపేతం కావడంలో, రాజకీయ బోధన, సైనిక నైపుణ్యతను పెంపొందించుకోవడం, ప్రజల రాజ్యాధికార అంగాల, ప్రజా పోరాటాల విస్తరణ మొదలయిన అన్ని రంగాలలో సాపేక్షిక అభివృద్ధి ఉన్నది. జిల్లా స్థాయి వరకు పని చేస్తున్న విప్లవ ప్రజా రాజ్యాధికార అంగాలు పిండ దశలో ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను ముందుంచుతున్నాయి. ఈ అన్ని రంగాలలోనూ సాధించవలసినది ఇంకా ఎంతో ఉన్నది.

ప్రస్తుతం దేశంలో కార్పొరేటీకరణ–సైనికీకరణలకు వ్యతిరేకంగా ఒక 'ప్రజా ఉద్యమ వెల్లువ' సాగుతున్నది. ఛత్తీస్ గఢ్ లో సిలింగేర్ గ్రామంలో ప్రారంభమయిన పోరాటం దేశంలోను, ప్రపంచంలోనూ ప్రజా పోరాటానికి చిహ్నంగా మారింది. తెలంగాణాలో ఆదివాసీ ప్రజలు తమ పోడు భూముల పరిరక్షణ కోసం సుదీర్ఘ కాలంగా పోరాడుతున్నారు. దాదాపు విప్లవోద్యమ

ప్రాంతాలంతటా పోరాటాలు జరిగాయి. ఈ ప్రజా పోరాటాల క్రమంలో పార్టీ సాయుధ పోరాటం ద్వారా రాజకీయాధికార స్వాధీన రాజకీయాల ప్రచారానికి కృషి చేసింది.

అంతర్జాతీయ పరిస్థితికి వస్తే, సామ్రాజ్యవాద ద్రవ్య, ఆర్థిక సంక్షోభం రోజు రోజుకూ తీవ్రతరమవుతున్నది. ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు, తమ బలాబలాలను బట్టి ప్రపంచాన్ని విభజించి దోపిడీ చేసేందుకూ సామ్రాజ్యవాదులు ఇంకా ఇంకా ప్రపంచీకరణ విధానాలను అమలు చేస్తున్నారు. ధనికులు, పేదల మధ్య తేడాలలో ఎన్నడూ ఎరుగనంత హెచ్చుదల ఉన్నది. వెనుకబడ్డ ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలు పూర్తిగా పరాధీన దేశాలుగా మారాయి. యుక్రెయిన్ యుద్ధం ఆహార, నిరుద్యోగ మొదలయిన సంక్షోభాలను తీవ్రతరం చేసింది. సామ్రాజ్యవాదానికి, పీడిత జాతులు, ప్రజలకూ మధ్య వైరుధ్యం మరింత తీవ్రతరమయింది. సామ్రాజ్యవాదుల మధ్య మరోసారి ప్రచ్ఛన్న యుద్ధం ప్రారంభమయింది. నాటో, క్వాడ్, ఆకస్ వంటి కూటములతో తిరిగి పునర్సంఘటితం అయ్యేందుకు అమెరికా ప్రయత్నిస్తున్నది. రష్యా, చైనా ప్రతి రంగంలోనూ పోటీ పడుతున్నాయి. దీంతో ప్రపంచమంతటా యుద్ధ వాతావరణం నెలకొని ఉన్నది.

భారతదేశంలో, హిందుత్వ ఫాసిస్టు మోదీ ప్రభుత్వం ప్రపంచీకరణ విధానాలను అవలంబించి, స్వావలంబన గురించి వల్లిస్తూనే దేశాన్ని 'పరాధీనం' గావించింది. దోపిడీ, పీడన, అణచివేత, వివక్షా కొనసాగుతున్నంత కాలం పీడిత వర్గాలు, సెక్షన్‌లు, జాతులూ వర్గ పోరాటం కొనసాగిస్తూనే ఉంటాయి. దేశంలో ఏడాది కాలం పాటు మిలిటెంటు పోరాటం చేసిన రైతులకు తల ఒగ్గి మోదీ ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకోవలసి వచ్చింది. కార్మికులు, బ్యాంకులు, భీమా కంపెనీలు, ఇతర ప్రభుత్వ, ప్రైవేటు రంగాల ఉద్యోగులు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమ బాట పట్టారు. ఫాసిస్టు ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశంలో యావత్తు పీడిత వర్గాలు, జాతులు, సెక్షన్ లు మరింతగా ముందుకు వస్తున్నాయి.

ఈ పరిస్థితులలో, పార్టీ 18వ వార్షికోత్సవం సందర్భంగా, వర్గ పోరాటాలను, ప్రజా పోరాటాలను పెంపొందించి, దీర్ఘకాలిక ప్రజాయుద్ధ మార్గంలో దృఢంగా ముందడుగు వేస్తామని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ ప్రతిన బూనుతున్నది.

**అభయ్**

**అధికార ప్రతినిధి,**

**కేంద్ర కమిటీ**